

హస్తినాపురం డివిజన్‌లో విద్యుత్ పీసీబీని ప్రారంభిస్తున్న రంగారెడ్డి జోన్ చీఫ్ ఇంజనీర్ పాండ్యానాయక్

## విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు

● రంగారెడ్డి జోన్ విద్యుత్ చీఫ్ ఇంజనీర్ పాండ్యానాయక్

**చంపాపేట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి):** విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా మెరుగైన చర్యలు తీసుకుంటున్నట్లు రంగారెడ్డి జోన్ విద్యుత్ చీఫ్ ఇంజనీర్ పాండ్యానాయక్ అన్నారు. హస్తినాపురం డివిజన్ నందనవనంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అగ్రికల్చర్‌కాలనీలో గురువారం విద్యుత్ లైన్, 11కేవీ వీసీబీని జిల్లా ట్రాన్స్‌కో ఎస్‌ఈ మాధవరెడ్డి కలిసి చీఫ్ ఇంజనీర్ ప్రారంభించారు. అనంతరం వారు అగ్రికల్చర్‌కాలనీ, వెంకటేశ్వరకాలనీ ప్రతినిధులతో మాట్లాడుతూ సబ్‌స్టేషన్ పరిధిలోని కాలనీలు, బస్తీల ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్తగా 11కేవీ లైన్‌లు, నియంత్రికలు ఏర్పాటు చేస్తున్నట్లు అన్నారు. కార్యక్రమంలో చంపాపేట డివిజనల్ ఇంజనీర్ రాజేందర్, బీఎన్‌రెడ్డి డివిజన్ ఏఈ శివకుమార్, కాలనీ అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, విద్యుత్ సిబ్బంది, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

## కస్తూరికాలనీలో కార్పొరేటర్ పర్యటన

**చంపాపేట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి):** హస్తినాపురం డివిజన్‌లోని కస్తూరికాలనీలో గురువారం కార్పొరేటర్ సుజాతానాయక్ పర్యటించి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీప్రతినిధుల కోరిక మేరకు ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేయనున్నట్లు అన్నారు. జిమ్ ఏర్పాటుకు అవసరం అయ్యే నిధుల మంజూరుకు కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని రక్షించండి

**అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ భూమిని రక్షించి.. ప్రజా అవసరాలకు ఉపయోగించాలని కోరుతూ అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్‌కు గురువారం తట్టిఅన్నారం గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. తట్టిఅన్నారం గ్రామ సర్వే నంబర్ 127/1 ప్రభుత్వ భూమిలో గ్రామానికి చెందిన దేవిడి మాలతి ప్లాట్లు చేసి అమ్మేస్తుందని తెలిపారు. సర్వే నంబర్ 127/2, 127/3 పేరుతో 127/1లోని సుమారు 5ఎకరాల ప్రభుత్వ భూమిని ప్లాట్లుగా మార్చి ఆమెకు సంబంధించిన కొందరు అమ్ముకున్నారని వివరించారు. నోటరీ పద్ధతిలో ప్లాట్లను విక్రయించారని పేర్కొన్నారు. గతంలో ఈ భూమిపై ఫిర్యాదు చేయగా మండల సర్వేయర్ ప్రభుత్వ భూమికి హద్దులను నిర్ణయించినట్లు తెలిపారు. ప్రస్తుతం హద్దులను తొలగించి నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ భూమి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుని సదరు భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఆ భూమిని ప్రజా అవసరాల కోసం ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన నల్ల ప్రభాకర్, మస్కు శ్రీనివాస్, మునీందర్‌రెడ్డి, రవికుమార్ కోరారు.

## విద్యా, వైజ్ఞానిక అంశాలపై ఆసక్తి పెంపొందించుకోవాలి

**వనస్థలిపురం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి):** విద్యా, వైజ్ఞానిక అంశాల పట్ల విద్యార్థులు ఆసక్తిని పెంపొందించుకోవాలని వనస్థలిపురం జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దుర్గలత అన్నారు. గురువారం వనస్థలిపురంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఆగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ విద్యార్థులు విద్యా, వైజ్ఞానిక అంశాల పట్ల ఆసక్తిని పెంచుకోవాలన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని పోటీ పరీక్షల్లో రాణించాలని సూచించారు. విద్యార్థులు రూపొందించిన పలు నమూనాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆగస్త్య ఫౌండేషన్ ఇగ్నేటర్ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ని-క్షయ్ శివిర్ స్క్రీనింగ్ శిబిరం

**మన్సూరాబాద్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి):** నాగోల్ డివిజన్ బండ్లగూడలోని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా శిక్షణా సంస్థ కార్యాలయ ఆవరణలో గురువారం టీబీ సెల్ వారి సహకారంతో ని-క్షయ్ శివిర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని సంస్థ డీడీజీ, డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ ఎస్.రవి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. టీబీ నిర్మూలనకై వంద రోజుల పాటు చేపట్టిన ఈ శిబిరంలో భాగంగా సంస్థలోని ఉద్యోగులకు ఉచితంగా టీబీ స్క్రీనింగ్, కౌన్సెలింగ్‌లు నిర్వహించారు. అదేవిధంగా టీబీ సెల్‌లోని మెడికల్ ఆఫీసర్లకు టీబీ సిగ్మాపై అవగాహన కల్పించడంతో పాటు ఉచిత క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో టీబీ సెల్‌కు చెందిన డా.అయేషా, డా.ఆదిత్య, డా.వాసు ప్రసాద్, డా.విల్సన్, డా.అనిల్‌కుమార్, సంస్థ ఉద్యోగులు డాక్టర్ మల్లేష్ పాల్గొన్నారు.

## 604 మంది మద్యంప్రియులపై డీడీ కేసులు

● రూ. 8,02,500 జరిమానా

**కొత్తపేట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి):** ఈ యేడాది జనవరి నుంచి ఈనెల 12వ తేదీ వరకు ఎల్బీనగర్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 604మంది మద్యం ప్రియులపై డీడీ కేసులు నమోదయ్యాయని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ దొంగరి వెంకటేశ్వర్లు తెలిపారు. డీడీ తనిఖీల్లో పట్టుబడిన మద్యంప్రియుల విషయంపై గురువారం ఆయన మాట్లాడుతూ కోర్టులో హాజరు పరచిన వారికి న్యాయమూర్తి జరిమానా, ట్రాఫిక్ డ్యూటీ, జైలుశిక్ష విధిస్తారన్నారు. డీడీ తనిఖీల్లో మూడోసారి పట్టుబడిన నాగోల్ వాసి చంద్రన్న(33)కు బుధవారం ఎల్బీనగర్ 6వ స్పెషల్ ఎంఎం కోర్టు జడ్జి 2 రోజుల జైలు శిక్ష విధించారని, 13మందికి ట్రాఫిక్ డ్యూటీ చేయాలని ఆదేశించారని తెలిపారు. మిగతా వారికి జడ్జీ ఈనెల 12 వరకు రూ 8,02,500ల జరిమానా విధించారని పేర్కొన్నారు. మద్యంతాగి వాహనాలు పడపడం ప్రమాదకరమని, ఈ ప్రమాదాల్లో ఎలాంటి సంబంధంలేని ఇతరులూ నష్టపోతారని ఆయన గుర్తుచేశారు. మద్యంతాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై చట్ట ప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఇద్దరు పాత నేరస్థులు అరెస్టు

● సెల్‌ఫోన్, రూ వెయ్యి నగదు స్వాధీనం

**కొత్తపేట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి):** ఎల్బీనగర్ పోలీసులు ఇద్దరు పాత నేరస్థులను అరెస్టు చేసి ఒక మొబైల్ ఫోన్, వెయ్యి రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. వారితో పాటు ఒక బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చంపేట్‌కు చెందిన పాత నేరస్థుడు కాత్రావత్ నవీన్ కుమార్(20) కోదాడకు చెందిన పాత నేరస్థుడు వంటిపులి గోపీ(27) ఎల్బీనగర్ మాజిద్ గల్లీలో ఉంటున్నారు. గుంటి జంగయ్య నగర్‌లో ఉండే బాలుడు వీరికి స్నేహితుడు. చెడు అలవాట్లకు బానిసలయ్యారు. వారు ఒంటరిగా, మద్యం మత్తులో ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ వద్ద కనిపించే వాళ్ల పై దాడి చేసి డబ్బు, విలువైన వస్తువులు దోచుకుంటున్నారు. ఆ బాలుడిని గతేడాది ఎల్బీనగర్ పోలీసులు అదుపులోకి తీసుకుని నోటీస్ ఇచ్చారు. నవీన్‌కుమార్ ను వనస్థలిపురం, సైఫాబాద్, శంషాబాద్, లింగాల పీఎస్‌ల పరిధిలో, గోపీని ఎల్బీనగర్, శంషాబాద్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. కటకటాల నుంచి బయటకు వచ్చి మళ్లీ నేరాలు చేస్తున్నారు. ముగ్గురు కలిసి తల్లిదండ్రుల నుంచి దూరంగా ఉంటున్నారు. ముగ్గురు ఇటీవలే మెట్రోస్టేషన్ వద్ద ఆటో ఎక్కిన వ్యక్తి వద్ద మొబైల్ ఫోన్, డబ్బు దోచుకున్నారు. మెట్రో స్టేషన్ వద్ద పాత నేరస్థులిద్దరితో పాటు బాలుడిని గురువారం అరెస్టు చేశారు. బాలుడిని సైదాబాద్ జువెనైల్ హోమ్‌కు, మిగతా ఇద్దరిని చర్లపల్లి జైలుకు తరలించారు.

# ఆర్టీసీని ప్రైవేటీకరణ నుంచి కాపాడాలి

● దిల్‌సుఖ్‌నగర్, హయత్‌నగర్ డిపోల ఎదుట

జేఏసీ ఆధ్వర్యంలో కార్మికుల నిరసన ప్రదర్శన

**చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి):** ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టి సంస్థను ప్రైవేటీకరణ చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను కార్మికులు సమైక్యతతో వ్యతిరేకించేందుకు సిద్ధం కావాలని టీజీఎస్ఆర్టీసీ జేఏసీ పిలుపునిచ్చింది. గురువారం ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్ డిపో ఎదుట కార్మికులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా జేఏసీ చైర్మన్ ఇ.వెంకన్న, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి, కత్తుల యాదయ్య, కన్వీనర్ సత్యం, డిపో కమిటీ అధ్యక్షుడు ఐవీకే రెడ్డి, కార్యదర్శి నిరంజన్, వెంకటయ్యతో అనేక మంది కార్మికులు ఆర్టీసీ యాజమాన్యానికి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈసందర్భంగా ఇ.వెంకన్న, థామస్‌రెడ్డి, సత్యం మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం కాంగ్రెస్ ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఆర్టీసీని ప్రైవేటీకరణ నుంచి కాపాడాలని డిమాండ్ చేస్తూ జనవరి 27న యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చిన విషయాన్ని వారు గుర్తు చేశారు. ఆర్టీసీ సంరక్షణ, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసమే జేఏసీగా ఏర్పడి త్వరలో చేయబోయే సమ్మెకు అన్ని యూనియన్లు తమ మద్దతు ప్రకటించి జేఏసీతో కలిసి పోరాడేందుకు ముందుకు రావాలని వారు విజ్ఞప్తి చేశారు. ఇదే తరహాలో కార్మికులు కూడా యూనియన్లకు అతీతంగా కలిసి కట్టుగా ముందుకు రావాలని కోరారు.



హయత్‌నగర్-1, 2 ఆర్టీసీ డిపోలలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

### ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

**హయత్‌నగర్ :** ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ కార్మికులు గురువారం హయత్‌నగర్-1,2 డిపోలలో నిరసన చేపట్టారు. ఆర్టీసీ కార్మిక నాయకుడు ఆమనగంటి వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ నిరసన కార్యక్రమానికి టీజీఎస్ఆర్టీసీ జేఏసీ రాష్ట్ర నాయకులు హాజరయ్యారు. జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులను తక్షణమే ప్రభుత్వంలో విలీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. 2021 వేతన సవరణలో 30శాతం వెంటనే అమలు చేయాలని కోరారు. 2017 వేతన సవరణల బకాయిలను, అలవెన్సును పెంచి చెల్లించాలన్నారు. అదేవిధంగా వెల్ఫేర్ కమిటీలను రద్దుచేసి ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలని కోరారు. సంపూర్ణ ఉద్యోగ



ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపో ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు యాదయ్య, థామస్‌రెడ్డి, సత్యం తదితరులు

భద్రతను కల్పించాలని, టికెట్లు తీసుకునే బాధ్యత ప్రయాణికుడికే ఉండాలన్నారు. సస్పెండ్ అయిన ఉద్యోగులను తిరిగి తీసుకోవాలన్నారు. ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి సంస్థకు ఇవ్వాలన్నారు. రిటైర్ అయిన ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. జేఏసీ కోకన్వీనర్ కత్తుల యాదయ్య మాట్లాడుతూ యాజమాన్యం కార్మికులకు పని భారం పెంచి కనీసం సెలువులు ఇవ్వడం లేదని అన్నారు. డిసెంబర్ 5న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సుద్దాల సురేష్, సత్యపాల్, రాంరెడ్డి, మల్లేష్, అచ్చాలు, మూర్తి, పీఎస్‌రావు, ఐబీపీ రెడ్డి బాలనర్సింహ, సతీష్, వెంకట్, శ్రీధర్‌స్వామి, వెంకటయ్య, బీఎస్ఎస్ రెడ్డి, శంకరయ్య పాల్గొన్నారు.

## గాయపడిన నవీనాచారికి సరూర్‌నగర్‌లో చికిత్స

● పరామర్శించిన ఎంపీ ఈటల రాజేందర్

**ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి):** కుంభమేళా నుంచి తిరుగు ప్రయాణంలో గాయపడిన కొత్తపేటకు చెందిన సుంకోజు నవీనాచారికి ఎల్బీనగర్‌లోని సాయిసంజీవిని ఆస్పత్రిలోని ఎంఐసీయూ వార్డులో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. జబల్‌పూర్ జిల్లా సిహోరి వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఆయన గాయాల పాలైన సంగతి తెలిసిందే. నవీనాచారిని చికిత్స నిమిత్తం జబల్‌పూర్‌లోని నేతాజీ సుభాష్‌చంద్ర బోస్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో చేర్పించారని తెలుసుకున్న నవీనాచారి మేనల్లుడు శివ ఆయనను గురువారం తెల్లవారుజామున అంబులెన్స్‌లో సరూర్‌నగర్‌లోని సాయిసంజీవిని ఆస్పత్రికి తీసుకొచ్చారు. నవీనాచారి రెండు కాళ్ల ఎముకలు విరిగాయని ఆస్పత్రి ఎండీ డాక్టర్ అంజయ్య తెలిపారు. ఎంఐసీయూలో ఆయనకు చికిత్స అందిస్తున్నట్లు ఆయన వివరించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నవీనాచారిని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కార్పొరేటర్లు పవన్‌కుమార్, రాధాధీరజ్‌రెడ్డి, ఆకుల శ్రీవాణి సాయిసంజీవిని ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు అన్నివిధాలా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నవీనాచారిని పరామర్శిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

## రైతులు తెచ్చే ధాన్యానికి మద్దతు ధర కల్పించాలి

● మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకులు రాజశేఖర్‌రెడ్డి

**ఓల్డ్‌మలక్‌పేట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి):** ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టి, రైతులు తెచ్చే ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని మార్కెటింగ్‌శాఖ సంయుక్త సంచాలకులు రాజశేఖర్‌రెడ్డి మార్కెట్ అధికారులకు సూచించారు. గురువారం మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో ఆయన పర్యటించారు. మార్కెట్‌కు వస్తున్న పంటలు వాటి నిల్వలు, కొనుగోళ్ల పనితీరు, ఈనామ్ విధానాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్ల గురించి అధికారులకు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మార్కెట్‌కు రైతులు ఒకేసారి ధాన్యాన్ని తీసుకురావడం వల్ల ధరల్లో కొంత హెచ్చుతగ్గులు సహజమన్నారు. ధాన్యం పెద్దఎత్తున మార్కెట్లకు వస్తుండడంతో మానిటరింగ్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అందులో భాగంగా మార్కెట్‌ను సందర్శించడం జరిగిందన్నారు. ధాన్యం అమ్ముకోవడానికి మార్కెట్‌కు వచ్చే రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది సహాయసహకారాలు అందించి మద్దతు ధర కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. మార్కెట్‌కు వస్తున్న ఏ రోజు పంటను ఆ రోజే కొనుగోలు చేయాలని కొనుగోళ్లలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకూడదన్నారు. రైతులు పంటను మార్కెట్‌కు తెచ్చేముందు కొన్ని జాగ్రత్తలు పాటించాలని ధాన్యాన్ని గ్రేడింగ్ చేసి తీసుకురావాలని అదేవిధంగా ధర కూడా తెలుసుకొని పంటను మార్కెట్‌కు తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట మార్కెట్ అధికారులు దామోదర్, చిలుక నర్సింహారెడ్డి తదితరులున్నారు.



మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు వివరాలను పరిశీలిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

## ఇసుక విక్రయ చిరువ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దు

● టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్

**మన్సూరాబాద్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి):** ఎల్బీనగర్ పరిసర ప్రాంతాల్లో ఇసుక కుప్పలు ఏర్పాటు చేసుకుని విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న చిరువ్యాపారులను ఇబ్బందులకు గురిచేయొద్దని రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబును టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ కోరారు. తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ ఇసుక విక్రయాలు చేసే చిరువ్యాపారులు గురువారం మధుయాష్కీగౌడ్‌ను కలిసి తమ గోడును వెళ్లబుచ్చుకున్నారు. కాళేశ్వరం నుంచి లారీల్లో వచ్చే ఇసుకను కొనుక్కుని రీటైల్‌గా విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నామన్నారు. కాగా గత కొన్ని రోజులుగా ఎస్ఓటీ పోలీసులు తమ అడ్డాలపై దాడులు చేస్తూ కేసులు పెడుతుండడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. వారి సమస్యలు విన్న మధుయాష్కీ వెంటనే సీపీ సుధీర్ బాబుకు ఫోన్‌చేసి వారి ఇబ్బందులు పెట్టొదని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన సీపీ ఇసుక విక్రయించే చిరువ్యాపారులను ఎలాంటి ఇబ్బందులు పెట్టొదని కింది స్థాయి అధికారులకు సూచించారు. ఇదే విషయమై ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, ఎస్ఓటీ పోలీసులు, జిల్లా మైనింగ్ అధికారులతోనూ మధుయాష్కీ మాట్లాడగా వారు సైతం సానుకూలంగా స్పందించారు. తమ సమస్య పరిష్కారం కావడంతో ఇసుక వ్యాపారులు మధుయాష్కీకి కృతజ్ఞతలు తెలిపారు.



సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మధుయాష్కీకి అందజేస్తున్న ఇసుక విక్రయ చిరువ్యాపారులు

## ఆలయ దిమ్మెను కూల్చడం సహించం : లక్ష్మయ్య

**వనస్థలిపురం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి):** వనస్థలిపురం రెడ్‌ట్యాంక్ సమీపంలోని ప్రసిద్ధ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ద్వారం ముందు ఏర్పాటు చేయనున్న దిమ్మెను టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అత్యవసరంగా కూల్చివేయడం ఎంటని ఆలయ కమిటీ చైర్మన్ కొలిశెట్టి లక్ష్మయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ అధికారులు కూల్చిన దిమ్మె వద్ద ఆలయ కమిటీ ప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ గత నెల 31న సచివాలయనగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు వేంకటేశ్వరస్వామి ఆలయ ద్వారం ముందు ఏర్పాటు చేయనున్న దిమ్మెను తొలగించాలని సదరు అధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో గురువారం అధికారులు ఆగమేఘాల మీద వచ్చి దిమ్మెను తొలగించడం సహించరానిదన్నారు. మున్సిపల్ అధికారులు ఇదే ఉత్సాహం కాలనీల్లో ఎలాంటి అనుమతులు లేకుండా చేపడుతున్న అక్రమ నిర్మాణాలు, ర్యాంప్‌లను తొలగించాలని డిమాండ్ చేశారు. స్వామివారి పల్లకిసేవ సమయంలో ఆలయం ముందు చాలాసేపు నిలపాల్సివస్తున్న నేపథ్యంలో తాము దాతల సహకారంతో ఆలయం ముందు తాత్కాలిక రేకుల షెడ్డు నిర్మాణానికి పనులు చేపడుతుంటే కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు మేరకు దిమ్మెను కూల్చివేయడం సరైన పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కాలనీవాసుల సంక్షేమానికి కృషిచేయాలని, భక్తుల మనోభావాలను దెబ్బతీయరాదని హెచ్చరించారు. కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపడుతున్న నిర్మాణపు పనులు అడ్డుకోరాదని హితువు పలికారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మీగణపతి ఆలయ చైర్మన్ బుద్దోలు అశోక్‌కుమార్‌గౌడ్, విశ్వహిందు పరిషత్ నాయకులు యాదగిరిరావు, ఆలయ ప్రతినిధులు సత్యనారాయణ, అనూప్, పాపారావు, రమేష్‌బాబు, శ్రీధర్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ అధికారులు కూల్చిన దిమ్మెను పరిశీలిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మయ్య తదితరులు

### ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

● 71 కేసులు నమోదు.. వాహనాలు సీజ్

**హైదరాబాద్ సిటీ :** ఇసుక అక్రమరవాణాపై నిఘా పెట్టిన రాచకొండ పోలీసులు వేర్వేరు ప్రాంతాల్లో దాడులు చేసి, కేసులు నమోదు చేస్తున్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా కమిషనరేట్ పరిధిలోని నాలుగు జోన్లలో 107 మందిపై 71 కేసులు నమోదు చేశారు. అంతేకాకుండా అక్రమంగా తరలిస్తున్న 3,762 టన్నుల ఇసుకతోపాటు ఇసుకను తరలిస్తున్న 9 లారీలు, 5 టిప్పర్లు, ఒక మినీ వ్యాన్, 8 ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఇసుక అక్రమ రవాణా చేసేవారిపై కఠినంగా వ్యవహరిస్తామన్న సీపీ సుధీర్‌బాబు ఇకముందు కూడా ఇదే తరహాలో దాడులు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



ఆనంద్(ఫైల్)

**హయత్‌నగర్ :** ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేట్ లక్ష్మారెడ్డిపాలెం సూర్యవంశీ కాలనీలో నివాసం ఉండే గుంజ ఆనంద్(16) క్యాటరింగ్ డబ్బుల విషయంలో జరిగిన గొడవ కారణంగా మనస్థాపానికి గురై ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం ఆనంద్ రంగనాయకులగుట్ట వద్ద గల భారతీ కిరాణాషాపు వద్దకు వెళ్లాడు. క్యాటరింగ్ డబ్బుల విషయంలో భారతి కొడుకు విగ్నేష్‌తో గొడవ పడ్డారు. ఆ తర్వాత ఇంటికి వెళ్లిపోయాడు. అదే రోజు సాయంత్రం భారతి, ఆమె కొడుకు విగ్నేష్‌తో పాటు కొంత మంది సూర్యవంశీ కాలనీలో ఉండే ఆనంద్ ఇంటికి వచ్చారు. ఇది గమనించిన ఆనంద్ ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుని పడుకున్నాడు. వారంతా ఇంటి మీద కు గొడవకు రావడంతో మనస్థాపానికి గురైన ఆనంద్ అదే రోజు రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని మృతిచెందాడు. బుధవారం ఉదయం ఆనంద్ నిద్రలేవకపోవడంతో తల్లి శాంతమ్మ తలుపు తట్టింది. అయినా ఆనంద్ లేవకపోవడంతో కిటికీలో నుంచి చూడగా ఆనంద్ ఫ్యానుకు వేలాడుతూ కనిపించాడు. వెంట నే స్థానికుల సహాయంతో తలుపులు బద్దలు కొట్టి ఆనంద్‌ను కిందకు దించారు. అప్పటికే ఆనంద్ మృతిచెందాడు. మృతుడి తల్లి శాంతమ్మ ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్‌లో పాలిటెక్నిక్ విద్యార్థి సత్తా

**అబ్దుల్లాపూర్‌మెట్ :** రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి చింతకాయల నరేందర్ సత్తా చాటాడు. నగరంలోని రామంతాపూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 10 జిల్లాల క్రీడాకారులతో పోటీపడ్డ నరేందర్ ఫైనల్‌లో వరంగల్ జిల్లా ప్రత్యర్థిని 3-0 తేడాతో ఓడించి బంగారు పతకాన్ని సాధించినట్లు ప్రిన్సిపాల్ నాగమునినాయక్ తెలిపారు. డిప్లొమాలో ఆటోమొబైల్ మొదటి సంవత్సరం చదువుతున్న నరేందర్ విజయం తోటి విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో నరేందర్‌ను ఆటో మొబైల్ విభాగాధిపతి శశిభూషన్‌గౌడ్, టీమ్ మేనేజర్ డాక్టర్ శంకర్‌మోకెన, ఫిజికల్ డైరెక్టర్ వెంకటరమణారెడ్డి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

## అభాగ్యుడిని చేరదీసి.. కుటుంబ సభ్యులకు అప్పగింత



షాజీని తల్లికి అప్పగిస్తున్న గిరి, ఎస్ఐ వెంకటేశ్

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి):** రోడ్లపై పిచ్చోడిలా తిరుగుతున్న ఓ అభాగ్యుడిని చేరదీసిన బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లోని మాతృదేవోభవ అనాథాశ్రమం నిర్వాహకులు.. రెండేళ్ల తర్వాత అతడి ఆచూకీ తెలుసుకుని గురువారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి.. నగరంలోని నాంపల్లి ప్రాంతానికి చెందిన అబ్రహాం షాజీ మతిస్థిమితం కోల్పోయి రెండేళ్ల క్రితం ఇంట్లో నుంచి బయటకు వచ్చి తిరిగి ఇంటికి చేరుకోలేదు. కాగా రోడ్డుపై తిరుగుతున్న అతడిని గమనించిన స్థానికులు మాతృదేవోభవ ఆశ్రమం నిర్వాహకుడు గట్టు గిరికి సమాచారం ఇవ్వగా, ఆయన షాజీని చేరదీసి తమ ఆశ్రమానికి తీసుకువచ్చి సపర్యలు చేసి మామూలు వ్యక్తిగా మార్చారు. ఈ క్రమంలో ఆధార్ కార్డు కోసం అతడిని ఆధార్ నమోదు కేంద్రానికి తీసుకెళ్లగా అప్పటికే అతడికి ఆధార్ ఉన్నదని వెల్లడయింది. దాంతో ఆధార్ కార్డులోని ఫోన్ నంబర్‌కు ఫోన్‌చేసి కుటుంబ సభ్యులకు వారికి విషయం తెలియజేయగా గురువారం షాజీ తల్లి అబ్రహాం రెజీనా ఆశ్రమానికి వచ్చి కుమారుడిని చూసి భావోద్వేగంతో కన్నీటి పర్యంతమైంది. ఆదిభట్ల ఎస్ఐ వెంకటేశ్ సమక్షంలో అతడిని రెజీనాకు అప్పగించారు.

## స్కూటీపై నుంచి పడి వ్యక్తి మృతి



శివాజీ మృతదేహం

**హయత్‌నగర్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి):** స్కూటీపై నుంచి కిందపడి వ్యక్తి మృతిచెందిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం ఐవీడబ్ల్యూఎస్ కాలనీకి చెందిన సత్తిపాటి శివాజీ(26) వృత్తి వస్త్ర వ్యాపారం. మంగళవారం సాయంత్రం శివాజీ తన స్కూటీపైన హయత్‌నగర్ నుంచి అబ్దుల్లాపూర్‌మెట్ వైపుకు వెళ్తుండగా పెద్దఅంబర్‌పేట్ ఫ్లైఓవర్ పైన ప్రమాదవశాత్తు స్కూటీపై నుంచి కింద పడ్డాడు. దీంతో తలకు, కాలు, చేతులకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు శివాజీని 108లో వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే శివాజీ చనిపోయినట్లు డాక్టర్లు చెప్పారు. శివాజీ చెల్లెలు పూజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం ఎరవేసి.. దోపిడీ చేసిన పాత నేరస్థుడు అరెస్టు

● అరతులం బంగారం, ఫోన్, బైక్ స్వాధీనం

**సైదాబాద్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి):** మామా అంటూ పరిచయం చేసుకుని బర్త్‌డే పార్టీ ఇస్తానని వైన్స్‌కు తీసుకువెళ్లి మద్యం తాగిన తరువాత దాడిచేసి నిలువుదోపిడీ చేసిన పాత నేరస్థుడిని సైదాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద అరతులం బంగారు ఉంగరం, మొబైల్ ఫోన్, బైక్ స్వాధీనం చేసుకున్నారు. గురువారం సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ వెంకన్ననాయక్ వివరాలు వెల్లడించారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీం ఏర్పాటు చేశారు. చంపాపేట ప్రధాన రహదారిపై ఉన్న 50 సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. దోపిడీకి పాల్పడింది కర్నూల్ జిల్లా నల్లచెలిమలకు చెందిన మాల తిరుపాలు(48)గా గుర్తించి బుధవారం అరెస్టు చేసి చోరీ సొత్తు అరతులం బంగారు ఉంగరం, మొబైల్ ఫోన్, అతడి బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు నగరానికి వలసవచ్చి మల్లాపూర్‌లో ఉంటూ ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఇతనిపై గతంలో ఘట్కేసర్, సైదాబాద్‌లో రెండు, ఎల్బీనగర్, చైతన్యపురి పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసులు నమోదై ఉన్నాయని ఏసీపీ వివరించారు. సమావేశంలో సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ కె. రాఘవేందర్, డీఐ ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

## పీడీఎస్ బియ్యం స్వాధీనం

**హయత్‌నగర్ ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి):** అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ గోదాంపైన హయత్‌నగర్ పోలీసులు గురువారం దాడి చేశారు. ఈసందర్భంగా సుమారు 26క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మూడు కొలత మిషన్లు, మూడు యాక్టివ్ బైక్‌లను సీజ్ చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు హయత్‌నగర్‌లోని ప్లాట్ నెంబర్ 47లో అక్రమంగా నిలువ ఉంచిన పీడీఎస్ రైస్ గోదాంపైన గురువారం పోలీసులు దాడి చేశారు. బియ్యం నిల్వ ఉంచిన ఎండి మోసిన్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. సలీం, శ్రీకాంత్ అనే ఇద్దరు వ్యక్తులు ప్రజల వద్ద నుంచి పీడీఎస్ బియ్యాన్ని కిలో పది రూపాయలు చొప్పున కొనుగోలు చేసి ప్లాట్ నెంబర్ 47లోని గోదాంకు తరలించి అక్రమంగా నిల్వచేస్తారు. నిలువ చేసిన బియ్యాన్ని జహీరాబాద్ తదితర ప్రాంతాల్లో ఎక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటారు. పోలీసులు మోసిన్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.